క్లుప్తంగా

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక మంచినీటి చెరువు వద్ద గల శ్రీమహా గణపతి ఆలయంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా ఆలయ అర్చకులు మణికంఠ శర్మ బ్రహ్మత్వంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ దేవతా కల్యాణాల విశిష్టతను, పరమార్థాన్ని వివరించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కల్యాణ మహోత్సవంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు కొత్తలంక సత్యనారాయణశర్మ, ఆర్.గణపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ రమణశ్రీ తదితరులు

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని చినకొత్తలంకలో సర్పంచ్ పొత్తూరి ఉమారాణి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 14 పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరించారు. ఆయా పథకాలపై డాక్యుమెంటరీ, పీఎం నరేంద్రమోదీ ప్రసంగం వినిపించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, కొత్తలంక సొసైటీ అధ్యక్షుడు పీటీవీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

12న దీపోత్సవం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ఆఖరి రోజు సందర్భంగా ఈ నెల 12న దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఇప్పటికే లింగాకారం, కైలాసాన్ని తలపించేలా మంచుకొండలతో భారీ సెట్టింగ్‌తో పాటు భక్తులు దీపాలు వెలిగించుకొనే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. దీపోత్సవం అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఆలయంలో చోరీ

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి డిబ్బీని ఎత్తుకుపోయారు. పక్కనే ఉన్న కొబ్బరితోటలో డిబ్బీని పగులగొట్టి రూ.5 వేలు నగదు అపహరించుకుపోయారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుడు కె.సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ట్రైనీ ఎస్‌ఐ వి.విష్ణు స్వరూప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాట్రేనికోన: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెయ్యేరు గ్రామానికి చెందిన బుడితి ఆనందరావు(65) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాట్రేనికోన ఎస్‌ఐ బి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3న చెయ్యేరులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆనందరావును కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆనందరావు కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు



తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయించి పంపిస్తున్న నాయకులు

తాళ్లరేవు: తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసేలా స్థానిక నాయకులు చర్యలు చేపట్టారు. ఆదివారం తాళ్లరేవు ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న పొలాల్లోని తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రత్న ముత్యాలు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, చిట్టూరి చలపతి, పొన్నాడ భైరవమూర్తి, కొల్లు శ్రీను, బొంతు శ్రీనివాస్ తదితరులు స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. రైతుల కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయించి దగ్గరుండి ట్రాక్టర్ ద్వారా ఉండి గొడౌన్‌కు తరలించారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకుని దగ్గరుండి మరీ తడిసిన ధాన్యాన్ని కొనేలా చేసిన నాయకులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాడు మురికి కూపం.. నేడు సుందర రూపం

- అమలాపురంలో చెరువులకు మహర్దశ
- రూ.1.50 కోట్లతో గరిగుంట చెరువు సుందరీకరణ
- ఇప్పటికే రూ.2 కోట్లతో ఉద్యానవనంగా తామర చెరువు



మురికి కూపంగా ఉన్న గరిగుంట చెరువు(నాడు)



సుందరీకరణ దిశగా అడుగులేస్తున్న గురిగుంట చెరువు(నేడు)

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలోని తామర చెరువును మూడేళ్ల కిందటే రూ.2 కోట్లతో ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు రూ.1.50 కోట్ల ఖర్చుతో గరిగుంట చెరువును సుందరీకరిస్తున్నారు. పట్టణంలోని దాదాపు 7 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రెండు చెరువులను మహర్దశ బాట పట్టించారు. నాడు గుర్రపుడెక్క, తూడు, పిచ్చి మొక్కలతో మురికికూపాలుగా ఉన్న ఈ రెండు చెరువులు పచ్చని తోరణాలుగా మారాయి.

కనిపించని పాత ఆనవాళ్లు

ఆక్రమణలతో బక్క చిక్కిపోతున్న చెరువుల పునరుజ్జీవానికి ప్రభుత్వం బాటలు వేస్తుంది. అమృత్ 2.0 పథకంలో భాగంగా గరిగుంట చెరువును రూ.1.08 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. దీనికి తోడు గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా చెరువు సుందరీకరణలో భాగంగా ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి కూడా రూ.25 లక్షలకు పైగా పలు అభివృద్ధి పనులకు కేటాయించింది. ఇప్పటికే గరిగుంట చెరువును పూర్తిగా ఆధునీకరించి చుట్టూ కంచె వేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. పచ్చని మొక్కలు, చెట్లతో పూర్తి పచ్చదనాన్ని నింపడంతో పాటు విద్యుత్ వెలుగులు ఏర్పాటుచేయనున్నారు. సాయంత్రం వేళ పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా చెరువును సుందరీకరిస్తున్నారు. మొత్తంగా రూ.1.50 కోట్లతో ఈ చెరువు పాత ఆనవాళ్లు అణువంతైనా కనిపించకుండా అభివృద్ధి జరుగుతోంది. అమృత్ 2.0 పథకంతో కేంద్ర ప్రభుత్వం గ్రీన్ కార్పొరేట్ సంస్థ ద్వారా పనులు చేపడుతుంటే మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ ద్వారా మరికొన్ని అదనపు పనులు చేస్తుంది. గతంలో పందులు, పశువులు పొర్లుతూ దుర్గంధం వెదజల్లే గరిగుంట చెరువు వద్ద ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి స్థానికులు ఔరా అంటున్నారు. త్వరలోనే చెరువు పనులు నూరు శాతం పూర్తి చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరుతోంది



మున్సిపాలిటీ ఎనిమిదో వార్డులో ఉన్న ఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చాం. ఇప్పుడు ఆ హామీ నెరవేరుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేసి మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా చెరువును ప్రారంభిస్తాం.

– తిక్కిరెడ్డి వెంకటేష్, 8వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్, అమలాపురం మున్సిపాలిటీ

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజ



అమలాపురంలో లక్ష రుద్రాక్ష పూజను నిర్వహిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్: పట్టణంలోని రవణం వీధిలోని సర్వ మంగళ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కాశీ పుణ్య క్షేత్రం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన లక్ష పంచముఖి రుద్రాక్షలతో పూజా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో నెలకొల్పిన జ్యోతిర్లింగాలను రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, అమలాపురం ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి, అష్టాదశ శక్తి పీఠాలను రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య సలహాదారు జ్వాలాపు రపు శ్రీకాంత్‌లు ప్రతిష్ఠించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ రవికుమార్, నాగవల్లి దంపతులు, వారి కుమారుడు సాయికృష్ణ శ్రవణ్, పద్మావతి మౌనిక దంపతులు కర్తలుగా లక్ష రుద్రాక్ష పూజను బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆచార్య బ్రహ్మత్వంలో 25 మంది వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, వంటిద్దు వెంకన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు మాత్రమే పార్కింగ్ స్థలం కేటాయించాలి



పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలో షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ స్థలం వాహనాలకు మాత్రమే కేటాయించాలని, అక్కడ ఇతర ఏ వస్తువులు ఉంచరాదని డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ సూచించారు. ఆదివారం ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సౌత్ ఇండియా, ఎస్ఆర్ షాపింగ్ మాల్స్ మేనేజర్లు, ఇతర ప్రతినిధులతో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడితో కలిసి ఆయన ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కొత్తగా నిర్మించిన షాపింగ్ మాల్స్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిన నేపథ్యంలో మాల్స్ నిర్వాహకులు పార్కింగ్ ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అధికారుల బృందం స్వయంగా ఆయా మాల్స్‌కు వెళ్లి పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సెక్యూరిటీ గార్డులను మరింత ఎక్కువ మందిని నియమించుకుని స్వీయ ట్రాఫిక్ నియంత్రణకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, సౌత్ ఇండియా, ఎస్ఆర్ షాపింగ్ మాల్స్ మేనేజర్లు దుష్యంత్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురంలో ఇటీవల ఏర్పాటైన మైత్రి ఆటో కన్సల్టెంట్స్ అండ్ ఫైనాన్సియర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక యెండూరి కన్వెషన్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ పి.పార్థసారథి, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా జనిపిరెడ్డి సురేష్, అధ్యక్షుడిగా జనిపిరెడ్డి హరి, కార్యదర్శిగా ఫణి, కోశాధికారిగా గోపి, ఉపాధ్యక్షులుగా గాదిరాజు గంగరాజు, వల్లభరెడ్డి రమణ, సంయుక్త కార్యదర్శిగా సాధనాల మురళి, డైరెక్టర్లుగా తాడి పద్మారెడ్డి, నక్కా శ్రీను, నల్లా వెంకటేశ్వరరావు, జొన్నాడ దుర్గ ప్రమాణ స్వీకారం చేశారు.

సాగర తీరంలో పర్యాటకుల సందడి



ఓడలరేవు సాగరతీరానికి పోటెత్తిన సందర్శకులు



సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

అల్లవరం: కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో ఓడలరేవు సాగర తీరంలో పర్యాటకులు సందడి చేశారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో పోలీసుల ఆంక్షలతో గత పది రోజులుగా పర్యాటకులు లేక తీరం బోసిపోయింది. మంగళవారంతో కార్తిక మాసం ముగుస్తుండడంతో తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడానికి దూర ప్రాంతాల నుంచి వందలాది మంది తరలిరావడంతో ఉదయం నుంచి తీరమంతా సందర్శకులతో నిండిపోయింది. పిల్లలు, యువతీయువకులు సముద్రంలో స్నానాలు చేయడానికి పోటీపడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తీరం పక్కనే ఉన్న సరుగుడు తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను చాటుకున్నారు. సముద్ర స్నానాలు చేసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు.

వైభవంగా హరిహర మహాయజ్ఞం

- జన సంద్రమైన గోదావరి తీరం
- శివనామ స్మరణతో మార్మోగిన ప్రాంగణం



హరిహర మహాయజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ దంపతులు



హరిహర మహాయజ్ఞానికి హాజరైన వేలాది మంది భక్తులు

యానాం: పవిత్ర కార్తిక మాసంను పురస్కరించుకుని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక గౌతమీ గోదావరి తీరంలో ఆదివారం నిర్వహించిన హరిహర మహాయజ్ఞం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 10 ఎకరాల స్థలంలో వేసిన పందిరిలో జరిగిన మహాయజ్ఞానికి యానాం పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో గోదావరి తీరం జన సంద్రమైంది. ప్రాంగణమంతా భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం 6 గంటల నుంచి నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు పాల్గొన్నారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, దీక్షాధారణ, సూర్య నమస్కారాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీనారాయణ పూజ, మహామృత్యుంజయ హోమం, పూర్ణాహుతిని నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్పస్వామి మాలధారులు సైతం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా యానాం, పరిసర ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈ మహాయజ్ఞాన్ని చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మావతి, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, చిక్కాల రామచంద్రరావు, మెట్ల రమణబాబు తదితరులు హాజరయ్యారు. హరిహర మహాయజ్ఞంలో భాగంగా ఎమ్మెల్యే అశోక్ దంపతులు ఆదివారం రాత్రి గోదావరి నదీమ తల్లికి మహాహారతి నిర్వహించారు. అనంతరం నేపాల్ నుంచి తెచ్చిన ప్రత్యేక రుద్రాక్షలను మహిళలకు పంపిణీ చేశారు. నియోజవర్గపరిధిలోని పేదవర్గాలకు విద్య, వైద్యం, సంక్షేమ సేవలు అందించేందుకు రూ.కోటితో స్వచ్ఛ సేవా సమితిని ఏర్పాటుచేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్స్ అందజేత



దాత శ్రీనివాస్ అందించిన స్టడీ చైర్స్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అల్లవరం: దేవగుప్తం హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఎస్ఆర్ఐ పోతుమూడి శ్రీనివాస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం స్టడీ చైర్స్‌ని అందజేశారు. హెచ్ఎం వేణుగోపాల్‌స్వామి అధ్యక్షతన హైస్కూల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రూ.70 వేల విలువ చేసే 50 స్టడీ చైర్స్‌ని అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సాయాన్ని అందిస్తానన్నారు. అనంతరం హెచ్ఎం ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, చింతా రామకృష్ణ, కొప్పిశెట్టి రామకృష్ణారావు, ఉపాధ్యాయులు అప్పారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

అల్లవరం: మండలంలోని వెదుళ్లపాలెంలో అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న దొమ్మేటి నాగమణిని ఎక్సైజ్ ఎస్‌ఐ స్వామిరెడ్డి ఆదివారం అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారని సీఐ శివరామకృష్ణరాజు తెలిపారు.

వేంకటేశ్వరుని శాంతి కల్యాణం



బండారులంకలో వేంకటేశ్వర స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంక బిళ్ళవారి వీధిలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి శాంతి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి తరపున పురోహితులు, దేవేరుల తరపున భక్తులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య మంగళ సూత్రధారణ జరిగింది. అనంతరం భక్తులకు లడ్డూ ప్రసాదం, తీర్థం పంపిణీ చేశారు. మహిళలచే సామూహిక లక్ష దీపోత్సవం నిర్వహించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకిలక్ష్మి, దంగేటి బుల్లబ్బులు, బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజ చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా తాళ్లరేవు శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి శివరామకృష్ణ నేతృత్వంలో వేద పండితులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి బిల్వ దళాలతో లక్షార్చన, చండీ హోమం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సందడిగా కార్తిక వనసమారాధనలు



ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేస్తున్న పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు



రజక సంఘ పెద్ద సుబ్బారావును సత్కరిస్తున్న సంఘీయులు



ముమ్మిడివరంలో కార్తిక వన సమారాధనలో పాల్గొన్న రజక సంఘ నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్‌లో పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. తొలుత ఉసిరి చెట్టు వద్ద సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, ప్రధాన కార్యదర్శి ఓడూరి ఫణి, కోశాధికారి చింత నాని, గౌరవాధ్యక్షుడు పుల్లేటికుర్తి భాస్కరరావు, దొంక సాయిబాబు, తాళాబత్తుల లక్ష్మణరావు తదితరులు కార్తిక పూజలు చేశారు. విశ్వ బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా హాజరై సహపంక్తి భోజనాలు చేసి ఐక్యతను చాటారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

పట్టణ సమీపంలోని కామనగరువులో పట్టణ రజకుల సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ వేడుకలో పట్టణ, పరిసర గ్రామాల సంఘీయులంతా కుటుంబ సమేతంగా హాజరై ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. రజకులంతా ఐక్యతలో ఉండాలని అమలాపురం తాలూకా రజక సంఘం అధ్యక్షుడు పేట వెంకటేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు మాచవరపు కాశీ, చెయ్యేటి కిరణ్‌కుమార్, పేట వీర్రాజు, మామిడికుదురు సత్యనారాయణ తదితరులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘ పెద్ద కొత్తపల్లి సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో పట్టణ సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్ష కార్యదర్శులు కాశే దుర్గాప్రసాద్, కార్యదర్శి భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేసి వన సమారాధనను ప్రారంభించారు. అనంతరం సంఘీయులంతా సహ పంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కాశే చంటి, కాశే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో...

ముమ్మిడివరం: స్థానిక తాలుకా రజక సంఘం భవనంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి రజక సంఘనాయకులు పాల్గొని వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు అయినాపురపు వెంకట్రావు, గొల్లపల్లి ధర్మారావు, ముమ్మిడివరపు రాంబాబు, కమిడి నాగేశ్వరరావు, వేముల వలస అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గాడిలంకలో..

మండలంలోని గాడిలంక రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం కాపు వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గిరిగి సాయిరామ్ దంపతులు ఉసిరి చెట్టు వద్ద కార్తిక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు.

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడగరువు కనకదుర్గమ్మవారి ఆలయంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. వివిధ రాజకీయ పార్టీ నాయకులు మెట్ల రమణబాబు, డీఎంఆర్ శేఖర్, లింగోలు పండు, గంధం పళ్లంరాజు, మండేల బుజ్జిలు వేడుకల్లో పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఐక్యతను చాటారు.

ఐక్యతతోనే శెట్టిబలిజల అభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్
- అమలాపురంలో సంఘీయుల వన సమారాధన



రూ.కోటి చెక్కును ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్

అమలాపురం రూరల్: ఐక్యతతోనే శెట్టిబలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లిలోని సత్తెమ్మ తల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తిక వన సమారాధన జరిగింది. దీనికి బోస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ చైర్మన్ వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వన సమారాధనకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా సంఘీయులు తరలివచ్చారు. తొలుత స్థానిక శ్రీరామపురం నుంచి ఊరేగింపుగా బయలు దేరిన సుభాష్ గోఖలే సెంటర్‌లోని శెట్టిబలిజల పితామహుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సత్తెమ్మ గుడి వద్ద వేదిక వద్దకు తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలతో ప్రదర్శనగా చేరుకున్నారు. తర్వాత శెట్టిబలిజల పతాకాన్ని సుభాష్ ఆవిష్కరించారు. వేలాది మంది సంఘీయులు శెట్టిబలిజ జెండాలను ప్రదర్శిస్తూ మోటారు సైకిళ్లు, వివిధ వాహనాలతో ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో ఇబ్బంది తలెత్తకుండా డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం ఉన్న వాహనం తాళ్లను తన శరీరానికి హుక్కులు తగిలించుకుని సభా వేదిక వద్దకు లాగుకుంటూ వచ్చారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, శెట్టిబలిజ సంఘాల నాయకులు పితాని బాలకృష్ణ, పెచ్చెట్టి చంద్రమౌళి, దొంగ శ్రీను, వాసంశెట్టి సత్యం, వాసంశెట్టి చినబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విరాళం

కార్తిక వన సమారాధనను వేలాది మందితో నిర్వహించిన శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ సంస్థకు అమలాపురానికి చెందిన శెట్టిబలిజ నేత వాసంశెట్టి సత్యం రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని శెట్టిబలిజల అభ్యున్నతికి వెచ్చించాలని ఆయన ఆకాంక్షించారు.